


# మధ్యతరగతి బాపతు

కాళిదాసు సుబ్బలక్ష్మి

**ఐదు గంటలవటంతోటే ఆఫీసు నుంచి బయటికొచ్చి, చేతిలో వున్న పంచి, గొడుగూ సరిచేసుకుని 'పార్క్' స్టేషనుకు బయలుదేరింది రాధ.**

ఆ సమయంలోనే టవర్ క్లాక్...ఎంతో వినసొంపుగా అయిదు గంటల్ని మ్రోగించింది. రాధ ముఖం వికసించింది పద్మంలా. 'సరిగ్గా ఇదే సమయానికి మధు తన ఆఫీసులో బయలుదేరివుంటాడు ... ఇంటికి!' అనుకుంటూ రాధ స్టేషను ప్లాట్ ఫారంమీద కొచ్చి ఎలెక్ట్రిక్ ట్రెయిన్ కోసం ఎదురు చూస్తోంది.

జనం ... ఆ కొసనుంచి ఈ కొసదాకా ప్లాట్ ఫారం నిండా నిలబడ్డారు. వీళ్ళంతా వుదయం నుంచి సాయంత్రం వరకూ తనలాగా ఏదో ఆఫీసులో పనిచేసి వస్తుంటారు! సాయంత్రం కావడం ఆలస్యం ... బస్సుల్లో, ట్రయిన్సుల్లో ... ఎక్కడా ఖాళీ వుండదు. ఒకటే తొందర, ఏదో మించిపోతున్నట్టు! రైలు రావటంలేదు! రెండు నిముషాలకే చికాకుగా వుంది. మనస్సు త్వరపెడుతోంది.

అప్పుడు అనుకుంది ... వీళ్ళంతా ఎందుకింత ... త్వరపడుతున్నదీ! మధు రూపు ఆమె స్మృతులలో మాటిమాటికీ కదులుతోంది! అతన్ని కలుసుకోవాలని హృదయమెంతో తాపత్రయ పడుతోంది. 'వీళ్ళంతా... ఎవరినో కలుసుకునేందుకు ... ఎవరితోనో మాట్లాడేందుకు ... ఉవ్విళ్లూరుతున్నారు!' తనూ అంతే!

ఎలక్ట్రిక్ ట్రెయిన్ పరుగెడుతూవచ్చి ... జనాన్ని ఒక నిముషం లోపలే తనలో ఇముడ్చుకుని మరో నిముషంలో కొండమీద నుంచి జారుతున్న పెద్ద నల్లరాయిలాగా ... గబగబా ముందుకు సాగిపోయింది. రాధ మధుని గురించే ఆలోచిస్తోంది ... అలాగే నిల్చొని.

ప్రక్క స్టేషనులో ట్రెయిన్ ఆగినప్పుడు చాలామంది దిగారు. ఖాళీ అయిన బెంచిమీద కూర్చుంది రాధ. మరల క్రొత్త మనుషుల్ని తనలోకి తీసుకుని రైలు సాగింది.

రాధ హృదయంలో మరలా ఏవో భావనలు కూడుకుంటున్నాయి...'తన జీవితం ధన్యం!'— ఇదే మాట రాధ ప్రతి స్నేహితురాలు పలుకుతుంది. తను ముచ్చటపడుతుంది. తన జీవితానికి నలువేపులా వెన్నెల విరజిమ్ముకొని వున్నట్లు భావిస్తుంది. నిన్న ఆఫీసులో లలిత అనే అమ్మాయి కూడా అన్నది— 'మధులాంటి సహృదయుడైన వ్యక్తి నీకు భర్తగా లభించడం అదృష్ట'మని. ఎవరో అన్నంత మాత్రానే తన జీవితం మధురం కాలేదు. తనకు తానుగా అవలోకించుకుంటేనే తెలుస్తుంది — తన జీవితంలో మధుర జగత్తును సృష్టించగల సమర్థుడు మధు అని.

ఊహల పల్లకీలలో విహరిస్తుండగానే తను దిగవల్సిన స్టేషను వచ్చింది. ట్రెయిను దిగేప్పుడు ఎవరో ఎదురుగా కూచున్న మనిషి — అదేపనిగా ఎప్పటినుంచో తనవేపు అదోలా చూస్తున్నాడని గ్రహించింది.

రైలు దిగి మెట్లెక్కబోతున్న రాధ — అప్రయత్నంగా అప్పుడే సాగుతున్న ట్రైను వంక చూచేటప్పటికి — రైల్లో తనవేపు అదేపనిగా చూచిన వ్యక్తి — ఇటు తిరిగి నవ్వుతూ చెయ్యి ఎగరేస్తున్నాడు — ఎరుగున్న మనిషిలాగా! అసహ్యం వేసింది. గబగబా మెట్లెక్కి అటువేపుకు వెళ్ళిపోయింది

'మధు ఆఫీసు నుంచి వచ్చివుంటాడు! ఉదయం ఆఫీసు కెళ్ళేప్పుడు మెడిసిన్ చదువుతున్న మీ స్నేహితురాలు కన్పించి వచ్చే వారం మనింటికి వస్తానన్నదని చెప్తే ఎంత సంతోషిస్తాడో? ఆదివారం నాటికి మంచి ప్రోగ్రాం నిర్ణయించుకునుంటే! మెరీనాకు వెళ్దామంటే — తల నెప్పి పుడ్తోంది ఎందుకో? ఆదివారమల్లా మినర్వాలోనో, రాక్సీలోనో — ఎక్కడో సినిమాలతో గడిపేయాల్సిందే! నాకూ అదే అలవాటయింది. మళ్ళీ వాళ్ళ మేనేజరు ఏమడిగాడో నన్నుగురించి?

'నీ భార్య బి. ఎ. చదివిందా? ఫరవాలేదే!' అన్నాట్ట ఒక రోజున. అంటే చదవకూడదు కాబోలు! మగవాళ్ళైనా బియ్యేలు చదివేది?

మరో రోజు మర్యాదగా పిలిచి 'నీ భార్య వుద్యోగం చేయడం నీ కిష్టమేనా?' అని అడిగాట్ట. ఎందుకో ఆయనకీ ధర్మసందేహం? భార్య అంటే 'పిల్లల్ని కనే యంత్రం' అనే ఆయనింకా భావిస్తున్నాడేమో? ఈ రోజుల్లో కూడా మగవాళ్ళ మనసుల్లో అంకితమైన భావాల్ని తీసేయడం చాలా కష్టం! ఎంత మంది రామలక్ష్మ లెన్నివిధాల చెబుతున్నా, రేడియోల్లో పాటలు కూడ ఆపేసి ప్రత్యేకంగా అదే పనిగా గొణుగుతూ ఘోష పెడుతున్నా వాళ్ళ ప్రవర్తనలో యుగాంతం వరకూ మార్పు రాకపోవచ్చు. ఎక్కడైనా బహిరంగంగా చెప్పాల్సివస్తే స్త్రీ సమస్యల్ని గూర్చి ఉదాత్తతను కుండలకొద్దీ కుమ్మరిస్తారు

''నీకు తెలీదు రాధా! మా ఆఫీసరు చాల మంచివాడు!'' అని మధు చెప్పాడు. ఆయనలో వున్న మంచితనం మధుకే తెలియాలి.

తాను యింటిని సమీపిస్తున్నకొద్దీ హృదయంలో ఆనందాతిరేకాలుత్పన్నమవుతున్నాయి. ఇంట్లో అడుగు పెట్టడంతోటే — మధు ఏవో కబుర్లు చెప్పబోతాడు. ఇవాళ

వాళ్ళ మేనేజరు ఏమైనా అన్నాడేమో? బహుశా యివ్వాళ–"ఏమయ్యా, మధుసూధన రావ్. నువ్వీ ఆఫీసులో ఐదు వందలు సంపా యిస్తున్నావు. నీ భార్య మరోవేపు నుంచి ఐదు వందలదాకా సంపాయిస్తోంది. డబ్బంతా ఏం చేస్తున్నారు?" అని అడిగివుంటాడు. మధు ఏమి సమాధానం చెబుతాడో? బ్యాంకి అక్కౌంటు వుందని చెబుతాడు. అప్పుడు ఆయన 'అయితే పుట్టబోయే పిల్లలకు నిలువ చేస్తున్నారన్నమాట!' అని అనివుంటాడేమో?

పిల్లలు! చాలా సంవత్సరాలనుంచి చాల మంది — యంత్రాల్లాగా పిల్లల్ని కంటూనే వచ్చారు. ఇంకా యీ పద్ధతి కొనసాగి వల్సిందేనా? ఈ విషయంలో మధును మెచ్చు కోవల్సిందే. నేటి సామాజిక వ్యవస్థలో ఆడవాళ్ళకు కూడా ఆర్థిక స్వాతంత్ర్యం కావాలంటాడు. ఎంత కాలమని పాతగాడిలోనే ప్రయాణం చేయటం? రాధ ఆలోచిస్తు యిల్లు చేరుకుంది.

తలుపులు తెరచివున్నాయి. గబగబా లోనికి వెళ్ళి చూచేటప్పటికి ... మధు అన్య మనస్కుడై కుర్చీలో కూర్చుని ... కనీసం తను రావటమైనా పసిపెట్టి ఇటు చూడక కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాడు. రాధ బాధపడింది. సంచీ, గొడుగూ అవతల పడేసి మధుకు దగ్గరగా వెళ్ళి అడిగింది —"ఏమిటి? ఇలా వున్నావ్?"

మధు రాధవైపు తిరక్కుండానే చెప్పాడు–'నేను ఉద్యోగం వదిలేసాను రాధా!' 'ఏంటి మధూ? ఏమిటి నువ్వనేది! నాకేమీ అర్థం కావటంలేదు. వుద్యోగమెందుకూ వదిలేయటం?' మధు వెంటనే సమాధానం చెప్పలేదు.

రాధ బాధ, ఆదుర్దా మిళితంకగా ఆలో చనలో పడింది. ఆమె చుట్టూరా ... ఏవో లక్ష ప్రశ్నలు నిల్చున్నాయి. "భార్యాభర్త లిద్దరూ వుద్యోగం చేయటం ఎంత చక్కగా వున్నది" అని ఎంతోమంది తనను ప్రశం సించారు! తను గడుపుతున్న జీవితాన్ని చూచి మెచ్చుకున్నారు. వాళ్ళంతా ఇప్పుడు ఏవగించు కుంటారు ... ఈ విషయం గురించి పరిపరి విధాల ఆలోచించిన రాధ తన బాధను లోలోపల అణుచుకుంటూ అడిగింది–"ఏమిటి మధూ! వుద్యోగం వదిలేయడం దేనికి?"

మధు ఇటువేపుకు తిరిగాడు ... మొహం మొద్దుబారిపోయి వుంది! ఏదో ఆవేశం అతని శరీరాన్ని యావత్తూ బద్దలు చేసుకుని బయటికి రావాలని ప్రయత్నిస్తూంది.

'ఆ రాస్కెల్ లేడూ? మా మేనేజరు వెధవ.'

రాధకేమీ అర్థంకాలేదు. ఒకరోజు అన్నాడు "మా మేనేజరు చాల మంచివాడు రాధా!" అని. మరలా ఈ రోజున "అతను రాస్కెల్! వెధవాయిట! ఏమిటో అంత విచిత్రం."

"వాణ్ణి చూస్తుండగానే నాకు పీక నులిమెయ్యాలనిపించింది. దుర్మార్గుడు. ఇవాళ కూడ రోజులాగా ఆ మాటా ఈ మాటా మాట్లాడి – ఆఖరున అన్నాడు – 'నీ భార్యా, నువ్వు కూడా ఆఫీసుకు ఉదయం వచ్చి సాయంత్రానికి తిరిగి వెళతారు కదా మరి భోజనం ఏర్పాటు ఎలాగూ ... హోటల్ భోజనం కూడా భోజనమేనా? సరేకానీ, మీ వుభయులూ ప్రేమించి పెళ్ళి చేసుకున్నారా ఏమిటి? రిజిష్టరు మేరేజా? కాంట్రాక్టు మేరేజా? నీ భార్య చాల అందంగా వుంటుందటగా? నిజమేనా?' – ఈ మాటలు ఇంకా వినలేక లావాంటి పైలు తీసుకుని వాడి మొహానికేసి కొట్టి రాజీనామా పత్రాన్ని పారేసి చక్కా వచ్చాను మధ్యాహ్నానికే!"

రాధ మనసు ఒక్కసారిగా దహించుకు పోయింది. ఆపాదమస్తకం వణుకుపుట్టింది.

'ఆఫీసు వ్యవహారాలతోనే వాడికి సంబంధం కాని...ఇలా నీ వ్యక్తిగత విషయాల్లోకి ప్రవేశించే అధికారం ఎవరిచ్చారు?'

'వాడు వఠి నీచుడు.'

'దీనికి కారకుడవు నీవే! ఇదివరకల్లా అతను అడిగిన దానికల్లా నవ్వుతూ సమాధాన మిచ్చావు. అతన్ని ప్రశంసించావు. ప్రత్యామ్నా యంగా ఈనాడు అతడిలా ప్రవర్తించాడు!'

'అయితే తప్పు నాదేనంటావ్! నన్నొక నీచుడిగా భావిస్తానంటావ్! ఇదేగా నీ అభిమతం? ఇతరుల చేతనేనలాంటి మాటలువిని సహించటం నీ కిష్టమేమోగాని నాకు పడదు!'

'ఎందుకలా వుద్రేకపడతావు! ఇలా జరగటం నా కిష్టమేనని నేను చెప్పటంలేదు. అలా అనేందుకు కావల్సిన అవకాశాన్ని నీవే కల్పించావంటున్నాను. పైగా జీవితంలో మనం కొన్ని విషయాలలో ప్రతిఘటనకు పూనుకోకూడదు. నైతిక విలువల విషయంలో మరీనూ! నీకు తెలియదు – ఉదయం లేచిన దగ్గర నుంచీ సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేంతవరకూ నా ముందు ఎన్నో విషయాలు జరిగిపోతాయి. రైలు స్టేషను ప్లాట్ ఫారం మీదా, ప్రయాణం చేసేప్పుడు ట్రెయిన్లో, ఎందరో నా వేపు చూచి పూర్వ పరిచయం వున్నట్లే నవ్వుతారు. ఇలాంటి విషయాలు సామాన్యం కావాలంటే మొదట్లో కొంత నిస్తబ్దత, నిండు జాగ్రత్త ఎంతైనా అవసరం!'

మధు కుర్చీలోంచి లేచి వాకిట్లో నిలబడ్డాడు. రాధ అతనివెనుక నించొనివుంది. వుద్రేకంగానే మధు అన్నాడు – 'నువ్వేదో పై తరహాకు చెందిన వ్యక్తివలె నాకు నీతుల బోధించనవసరంలేదు. నీలాగ నేను వ్యక్తుల మానావమానాల్ని సహించలేను!' అని అంటూనే మధు బయటికి వెళ్ళిపోయాడు. రాధ అలా చూస్తూనే వుండిపోయింది.

* * *

హోటలు నుంచి కుర్రాడు టిఫిన్ క్యారియర్ తెచ్చి లోపల పెట్టిపోయాడు. రాధ భోజనం చేయలేదు. తొమ్మిది గంటలు దాటిపోయింది. మధు తిరిగి రాలేదు.

"రేపు వుదయానికల్లా నా జీవితం అపహాస్యం పాలవుతుంది. 'నీ జీవితం బాగా వుందని' ప్రశంసించినవాళ్ళు 'నీ జీవితం భగ్నమైంది' అని సానుభూతిని ప్రకటిస్తారు 'మీ గృహస్థ జీవితం స్వర్గతుల్యం' అని నిన్నటి రోజున పలికిన లలిత మాటకు ఈ రోజున అర్థం లేదు."

ఇలాంటివెన్నో ఆలోచనలు ఆమె హృదయపు కడలిలో కల్లోలాన్ని, ఘోషను రేపాయి.

మధు నన్ను అర్థం చేసుకోటంలో పొరబడుతున్నాడేమో? నేను వుద్యోగం చేయడం అతని కిష్టం లేదేమో? – ఈ భావాలు రాధ హృదయంలో రేగటంతో ఆమె మొహంలో విషాదచ్ఛాయలు – కారు మేఘాల్లాగా అలుముకున్నాయి. నరాల్లోని ఆవేదన బుసలుకొట్టింది. తనలోని ఆశయా లకు సంబంధించిన స్మృతులు పడగలెత్తి పురోగమించమని ఆదేశించినాయి

* * *

మధు మరల తిరిగి రానేలేదు. యధాతథంగా రాధ తన వుద్యోగాన్ని నిర్వర్తించుకు పోతూంది. ●